




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం నవంబర్ 14 2025 | సంపుటి : 2 | సంచిక : 40 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4





ఇక్కడ పెట్టుబడులకు భద్రతకు ప్రభుత్వం హామీ

## పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్

- వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ
- అధికారంలో ఎవరున్నా వన్నె తగ్గని హైదరాబాద్ బ్రాండ్
- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటుకు హైదరాబాద్ అనుకూలం
- హైదరాబాద్‌లో రోడ్లకు ప్రముఖ కంపెనీల పేర్లు
- ఢిల్లీ అమెరికన్- ఇండియా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ,నవంబర్13 :**
హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో హైదరాబాద్ ఉందన్నారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని సీఎం తెలిపారు. జీసీసీలకు గృమస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి అన్నారు. ఢిల్లిలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు-భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తెలంగాణలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి వివరించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ భారత దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

మిగతాద్ది 2 లో




జూబ్లీహిల్స్ ఫలితంతో

## రాజకీయ పార్టీల భవిష్యత్

» హోరాహోరీగా పోరాడిన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి
» గెలుపుపై ఎవరి అంచనాలు వారివే
» ఎగ్జిట్ పోల్ సర్వేతో కాంగ్రెస్‌లో ఉత్సాహం

**హైదరాబాద్,నవంబర్13 :**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం మరో 24 గంటల్లో తేలనుంది. అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్, ఎలాగైనా జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. సుమారు నెలరోజుల పాటు పార్టీలు తమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. విమర్శలు, ప్రతివిమర్శలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచేదెవరో శుక్రవారం తేలనుంది. ఎగ్జిట్ పోల్ సర్వేతో కాంగ్రెస్‌లో ఉత్సాహం నెలకొంది. పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని ధీమాలో అధికార కాంగ్రెస్ ఉంది. అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాజకీయ పార్టీల భవిష్యత్ తేల్చనుంది. సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్ , ఎలాగైనా జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. బిజెపి కూడా గెలిచి తీరాలన్న పట్టుదలతో పోరాడింది. సుమారు నెలరోజుల పాటు పార్టీలు తమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. సాధారణంగా ఎక్కడైనా ఉప ఎన్నికలో భారీగా పోలింగ్ శాతం నమోదు అవుతుంటుంది. కానీ జూబ్లీహిల్స్‌లో మాత్రం ఒక్క శాతమే ఓటింగ్ పెరగడంతో.. గెలుపు ఎవరిని వరిస్తుందా అనేది తెలియని పరిస్థితి.

మిగతాద్ది 2 లో



## ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజులు కడతా

» విద్యార్థుల టెన్త్ పరీక్ష ఫీజు చెల్లిస్తానన్న కిషన్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్13 :**
కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్ష ఫీజును తానే కడతానని ప్రకటించారు.

2 లో




## కొండా సురేఖ వివాదంపై నాగార్జున కీలక నిర్ణయం

**హైదరాబాద్:**
మంత్రి కొండా సురేఖపై టాలీవుడ్ హీరో అక్కినేని నాగార్జున వివాదంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టులో కొండా సురేఖపై దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసును నాగార్జున విత్‌డ్రా చేసుకున్నారు.

## పేలుడు ఘటనలో 13కు చేరిన మృతుల సంఖ్య

### చికిత్స పొందుతూ మరొకరు మృతి

**న్యూఢిల్లీ,నవంబర్13 :**
దేశ రాజధాని ఢిల్లీలో పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో వ్యక్తి మరణించారు. దీంతో పేలుడు ఘటనలో మరణించిన వారి సంఖ్య 13కి పెరిగింది. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని చారిత్రక కట్టడం



ఎర్రకోట సమీపంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. సాయంత్రం 7 గంటల సమయంలో భారీ శబ్దంతో పేలుడు జరిగింది. ఈ ఘటనలో అక్కడికక్కడే తొమ్మిది మంది మరణించారు. మరో 20 మంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరుసటి రోజు ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. ఇప్పుడు మరో వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మిగతావారికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది.



02

## ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలి

### - మంత్రి పొన్నం

**హైదరాబాద్:**
ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త కాలనీలకు బస్సు రూట్‌లు పెంచేలా అధ్యయనం చేయాలన్నారు. కారుణ్య నియామకాల కింద ఎంపికైన కండక్టర్ల ప్రొవిజన్ పీరియడ్ రెండేళ్లకు తగ్గించాలని చెప్పారు.



## దేశవ్యాప్తంగా ఉల్లి రైతులకు కన్నీరు

» కొనుగోలు ధరలు పెరిగినా గిట్టుబాటు మృగ్యం
» మార్కెటింగ్ సౌకర్యం లేక ఆందోళన


**న్యూఢిల్లీ,నవంబర్13 :**
దేశవ్యాప్తంగా ఉల్లి పంట పండించిన అన్నదాతలు బోరున విలపిస్తున్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు, కొనడానికి అధికధరలు వెచ్చించి ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు.ఏపిలో కర్నూలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం హడావిడి చేసినా రైతులకు ఒరిగిందేమీ లేదు.

02

## అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం

- సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సడలింపులు ఇవ్వాలి
- కేంద్రానికి మరోమారు లేఖ రాసిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


**హైదరాబాద్,నవంబర్13 :**
సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సమస్యలపై కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి లేఖ రాశారు. 'మొంథా' తుఫాను, అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, రైతులకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అలానే సోయాబీన్ ఎఫ్ఏక్యూ ప్రమాణాల్లో సడలింపు ఇవ్వాలని మంత్రి తుమ్మల కోరారు. వర్షాల ప్రభావంతో గింజల్లో రంగు మారడం, ముడతలు వచ్చాయి. ఔంఈఇఆ, ఔఅఅఈ సంస్థలకు పంటల నాణ్యత సడలింపు ఆదేశాలు ఇవ్వాలని కేంద్రాన్ని మంత్రి తుమ్మల కోరారు.రాష్ట్రంలో 3.66 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారని, ఎకరాకు 7.62 క్వింటాళ్ల సగటు దిగుబడి



వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 48,757 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడంతో 14,519 మంది రైతులకు లాభం చేకూరిందని మంత్రి తెలిపారు. కనీస మద్దతు ధర కింద మొత్తం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు ఔంఈఇఆ, ఔఅఅఈ సంస్థలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పత్తి కొనుగోళ్లలో ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి అనేది రైతులకు నష్టం చేకూరుస్తుందని, ఆ పరిమితిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి తేమ శాతం సడలించి, ఎకరాకు 11.74 క్వింటాళ్ల దిగుబడి ఆధారంగా కొనుగోలు కొనసాగించాలని కేంద్రానికి సూచించారు. పత్తి మొక్కజొన్న, సోయాబీన్ రైతులకు రక్షణ కల్పించేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

2 లో





**హైదరాబాద్,నవంబర్13 :**
తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలయింది. నవంబర్ 15వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి ఈ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ దరఖాస్తులు స్వీకరణకు తుది గడువు నవంబర్ 29వ తేదీతో

## సుప్రీం ఆదేశాలను పాటించని స్పీకర్

» ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో పూర్తికాని విచారణ
» మరోమారు సుప్రీంలో కేసు వేసిన బిఆర్ఎస్
» సోమవారం విచారణ చేపడతామన్న సుప్రీం

**న్యూఢిల్లీ,నవంబర్13 :**
తెలంగాణ రాజకీయాల్లో మరోమారు ఉత్కంఠత మొదలయ్యింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణలో స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్‌డ్డారని బిఆర్ఎస్ సుప్రీంలో కేసు దాఖలు చేసింది. అయితే అంతకు ముందే ఎమ్మెల్యేల ఫిరాయింపు విచారణపై స్పీకర్ సుప్రీంను గడువు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు.



2లో..

## పెరుగుతున్న చలి తీవ్రత

» సిర్పూర్‌లో అత్యంత కనిష్టంగా 7.1 డిగ్రీలు
» అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరిక



2లో..

**హైదరాబాద్/ఆదిలాబాద్,నవంబర్13 :**
రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు పెరిగిపోతున్నది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలిలో ప్రజలు వణికిపోతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గురువారం ఉదయం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠంగా 7.1 డిగ్రీలుగా నమోదయింది. ఇక తిర్యాణిలో 8.2 డిగ్రీలు నమోదయింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 8 గంటలు దాటినప్పటికీ చలి తీవ్రత తగ్గకపోవడంతో స్కూళ్లు, కార్యాలయాలు, రోజువారీ పనుల నిమిత్తం

# దేశవ్యాప్తంగా ఉల్లి రైతులకు కన్నీరు

మొదటి పేజీ తరువాయి

చాలా చోట్ల రైతులు ఉల్లి పంటను మార్కెట్‌కు తీసుకెళ్లితే రవాణా ఖర్చులు కూడా రావడం లేదని, పొలాల్లోనే వాటిని వదిలేస్తున్నారు. కొన్ని మాసాల నుంచే అక్కడి రైతులు మద్దతు ధర కోసం వివిధ రూపాల్లో పోరాడుతూనేవుంది. హైదరాబాద్ లాంటి పట్టణాల్లో కిలో ఉల్లి మాత్రం 30కి పైనే అమ్ముతున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఇప్పటికే పాత ఉల్లి పంట నిల్వలు ఉండగా..ఇప్పుడు కొత్త పంట కూడా మార్కెట్‌లోకి రావడం, నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ దేశాలకు ఎగుమతులు నిలిపివేయడం వంటి కారణాల మూలాన ధరలు అమాంతం పడిపోయాయి. మంగళవారం కిలో రూ.2కు పడిపోయిన ధరలు బుధవారం రూ.1 కంటే దిగువకు పడిపోయాయి. కనీసం రవాణా ఛార్జీలు కూడా దక్కకపోవడంతో రైతు మార్కెట్‌లోనే కంటతడి పెడుతున్నారు. ఉల్లి ప్రధాన మార్కెట్లలో ఒక్కటైన మధ్యప్రదేశ్‌లోని మాల్వా ప్రాంతంలో మంగళవారం కిలో ఉల్లి ధర రూ.2గా ఉంది. బుధవారం మరో ప్రధానమార్కెట్ అయిన మందిసౌర్‌లో కిలో ఉల్లి ధర రూ.1కి, అంతకంటే దిగువకు పడిపోయింది. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. మాల్వాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక రాజస్థాన్‌లోని అల్వార్‌లోనూ ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. అక్కడ కూడా కిలో ఉల్లి రూ.1 నుంచి రూ.5 మధ్యనే పలుకుతోంది. నాణ్యత మరీ అధికంగా ఉంటే కిలో రూ.8 చొప్పున కొంటున్నారు. ఇక ఆసియాలోనే అతిపెద్ద ఉల్లి పాయల మార్కెట్‌గా పేరొందిన మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలోనూ ఉల్లి రైతు గోడు అంతాఇంత కాదు. ÷రిత్త, పాత ఉల్లిపాయల నిల్వలు ఒకేసారి మార్కెట్‌లోకి వచ్చిన నేపథ్యంలోనే ఉల్లి పాయల ధరలు పడిపోయినట్లు ప్రకటించి రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని బిజెపి నేతృత్వ డబుల్ ఇంజిన్ సర్కార్లు చేతులు దులిపేసుకుంటున్నాయి. అన్నదాతలకు కనీస మద్దతు కూడా ఇవ్వకుండా పరిహాసమాడు తున్నాయి. ప్రభుత్వం తక్షణమే ఉల్లి పంటకు మద్దతు ధర కల్పించి..ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసినా..డబుల్ ఇంజిన్ సర్కార్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరి స్తోంది. దాదాపు ఆరు నెలలుగా తమ ఉత్పత్తులను నిల్వ చేసినప్పటికీ.. సరైన ధర లభించడం లేదని, ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. వెల్లుల్లి ధరలు కూడా భారీ స్థాయిలో పడిపోవడంతో అక్కడి రైతన్నలు ఆక్రందనకు గురౌతున్నారు. వాతావరణ పరిస్థితులు, నిల్వ చేయడానికి అవసరమైన గోడాన్లు లేకపోవడం, ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి ఉల్లి పంట సాగు చేసే రైతన్నలను సంక్షోభంలోకి నెట్టేశాయని మహారాష్ట్ర స్టేట్ ఆనియన్ ప్రొడ్యూసర్స్ ఫార్మర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు భరత్ డిఘోలే అన్నారు. సంక్షోభ నివారణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రత్లాం వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ ఉల్లి ధర కేవలం రూ.600గా ఉంది. పొలం నుంచి మార్కెట్‌కు ఉల్లిని తరలించడానికి రవాణాకు అయిన ఖర్చు కూడా రావడం లేదని నగ్రా గ్రామానికి చెందిన ఓ అన్నదాత వాపోయాడు. '30 క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌కు తరలించేందుకు రూ.2 వేలు అయ్యింది. మార్కెట్‌లో అమ్మగా క్వింటాల్‌కు రూ.250లే వచ్చాయి. తీవ్రంగా నష్టపోయాం' అని దుంఖం నిండిన కళ్లతో ఆ రైతు అన్నారు.

# జూబ్లీహిల్స్ ఫలితంతో రాజకీయ పార్టీల భవిష్యత్

మొదటి పేజీ తరువాయి

తామే గెలుస్తామంటూ కాంగ్రెస్ పార్టీ, కాదు కాదు తామే గెలుస్తామంటూ బీఆర్ఎస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సర్వేలు అన్నీ తమ వైపే ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతుండగా.. సైలెంట్ ఓటింగ్ జరిగిందని.. తద్వారా తమ విజయం ఖాయమని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. మొత్తంగా శుక్రవారం మధ్యాహ్నం తుది ఫలితం వెల్లడయ్యే వరకు ఉత్కంఠ తప్పని పరిస్థితి. ఇప్పటికే అధికారులు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో లెక్కింపు ప్రారంభం కానుంది. పది రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఉప ఎన్నికలో లక్షా 94 వేల 632 ఓట్లు పోలయ్యాయి. వీటిని పది రౌండ్లుగా 42 టేబుళ్లపై లెక్కింపు జరుపనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, ఆ తర్వాత 103 హోం ఓటింగ్‌లను లెక్కించిన తర్వాత ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. సాధారణంగా 14 టేబుళ్లపై కౌంటింగ్ జరుగుతుంది. ఉప ఎన్నిక కావడం, ఉద్యోగులు అందుబాటులో ఉండడంతో ఎక్కువ టేబుళ్లు ఏర్పాటు చేసి త్వరగా లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఉదయం 8.45 గంటలకల్లా తొలి రౌండ్ ఫలితం వెల్లడి కానుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోపే తుది ఫలితాన్ని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని మొత్తం 10 రౌండ్లుగా కొనసాగించ నున్నారు. ఒక్కో రౌండ్ వారీగా ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల బరిలో 58 అభ్యర్థులతో పాటు నోటాకు పోలైన ఓట్ల సంఖ్యను అధికారులు వెల్లడించనున్నారు. కాగా కౌంటింగ్ కేంద్రంలో పటిష్టమైన మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. దీనికితోడు సీసీ కెమెరాలతో పర్యవేక్షణ, సాయుధ బలగాలతో 24గంటల పహారా ఉండనుంది. స్టేడియానికి 100 మీటర్ల మేరలో ఆంక్షలు ఆమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు. ఎన్నిక ఏదైనా మా వైఖరిలో తేడా ఏమీ ఉండదని జూబ్లీహిల్స్ ఓటర్ మరోసారి నిరూపించారు. ప్రతిసారీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోలింగ్ 50 శాతానికి మించడం లేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 47.49 శాతం పోలింగ్ నమోదు కాగా.. తాజాగా ఉప ఎన్నికలో 48.49 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇక్కడ కేవలం ఒక్కశాతం మాత్రమే పోలింగ్ శాతం పెరగడం గమనార్హం. ఉప ఎన్నిక సమయానికి నియోజకవర్గంలో మొత్తం 4.01 లక్షల ఓటర్లు ఉండగా.. లక్షా 94వేల 631 మంది మాత్రమే ఓటుహక్కును వినియోగించుకున్నారు. కేవలం 48.49 శాతం పోలింగ్ మాత్రమే నమోదు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారులు బుధవారం అధికారికంగా ప్రకటించారు. 99,771 మంది పురుషులు ఓటు వేశారు. బస్తీల్లో ఉండే ఓటర్లు ఓటేసేందుకు ఆసక్తి చూపగా, అపార్ట్‌మెంట్లలో ఉన్న ఓటర్లు చాలావరకు ఓట్లు వేయనట్లు తెలుస్తోంది. మరోవైపు కొత్తగా ఓటుహక్కు వచ్చిన యువత ఓటు వేసేందుకు ఉత్సాహం కనబర్చారు. అయితే పోలింగ్ శాతం తగ్గడానికి కారణాలు లేకపోలేదని విశ్లేషకుల అంచనా.. ప్రైవేట్ ఉద్యోగులకు సెలవులు లేకపోవడం, ఓటింగ్ శాతం పెంచడంలో అధికారుల ప్రచార లోపం, పోలింగ్ బూత్‌ల వరకు ఓటర్లను రప్పించడంలో రాజకీయ పార్టీలు విఫలం అయ్యాయనే ఆరోపణలున్నాయి.

# పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్

మొదటి పేజీ తరువాయి

మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ట్రిపుల్ ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చైనా 1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని అన్నారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు. భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని హైదరాబాదులో ఆ ట్రెండ్ ను మార్చాలని తాము అనుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతామని సీఎం అన్నారు. హైదరాబాద్‌లో రోడ్లకు నేతల పేర్లు పెట్టే ట్రెండ్ మార్చి.. ప్రముఖ కంపెనీల పేర్లు పెట్టాలని భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు తెలంగాణలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు. అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన మొదటి ప్రాధాన్యత అని వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారనుందన్నారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత 23 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణరైజింగ్ 2047 విజన్ ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం ఢిల్లీలో వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. రేవంత్ రెడ్డి విజన్ బోల్డ్, క్లియర్, అచీవబుల్ అని సిస్కో మాజీ సీఈఓ, టెక్ దిగ్గజం జాన్ ఛాంబర్స్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా, సాధించగలిగేలా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం ఎంతో ప్రేరణాత్మకంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మా సభ్యులలో అత్యధికులం డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతాం అనిడా. ముఖేష్ ఆఘి అన్నారు. తెలంగాణ విజన్‌ను దగ్గరగా తెలుసుకోవాలని మేమంతా ఆసక్తిగా ఉన్నాం. . డిసెంబరు 8,9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కానున్నట్లు అమెరికా–భారత్ వ్యూహాత్మక ఫోరం అధ్యక్షుడు ముఖేష్ ఆఘి తెలిపారు.

# నేడు బీహార్ ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఫలిస్తాయా

## మరోమారు నితీశ్ సిఎం అయ్యేనా

దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న బిహార్ ఎన్నికల ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నాయి. సీఎం నితీశ్ కుమార్ తన అధికారాన్ని నిలబెట్టుకుంటారా? లేదా? అనేది నేటితో తేలిపోతుంది. ఎగ్జిట్ పోల్ సర్వేల ప్రకారం మళ్లీ ఎన్‌డిఎ గెలుస్తుందని ప్రకటించారు. అయితే దీనిని తేజస్వియాదవ్ కొట్టి పారేశారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా చేసి రికార్డు నెలకొల్పిన నితీశ్ కుమార్ ఈసారి గెలిస్తే సరికొత్త చరిత్ర సృష్టించిన వారవుతారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల సంఘం ఇటీవల తెలిపింది. కౌంటింగ్ సెంటర్లలో రెండంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామని వెల్లడించింది. మొదటి భద్రతా వలయంలో కేంద్ర పారామిలిటరీ దళాలు, ఆ తరువాత రాష్ట్ర పోలీసు బలగాలతో పహారాను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. 24/7 సీసీటీవీ నిఘా కూడా ఉంటుందని వెల్లడించింది. ఇక ఓట్లు భద్రపరిచిన ప్రతి స్ట్రాంగ్ రూమ్ క్యాంపస్ వద్ద జిల్లా సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఓ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా ఎలక్షన్ ఆఫీసర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లు స్టాం÷-రగ్ రూమ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఈసీ ఆదేశించింది. ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ భారీ స్థాయిలో నమోదైన విషయం తెలిసిందే. 243 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఓటింగ్ నిర్వహించగా రికార్డు స్థాయిలో 67.13 శాతం మేర పోలింగ్ జరిగింది. దీంతో, ప్రజాతీర్పుపై ఉత్కంఠ పతాకస్థాయికి చేరుకుంది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే క్లీన్ స్వీప్ చేస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కూటమి నేత తేజస్వీ యాదవ్ మాత్రం ఈ అంచనాలను కొట్టిపారేశారు. తమ కూటమి మంచి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అన్నారు.సీఎం నితీశ్ సారథ్యంలోని జేడీ(యూ), బీజేపీతో సహా ఎన్డీయే (ఔఆం) కూటమిలోని ఐదు పార్టీలు బరిలో నిలిచాయి. జేడీ(యూ), బీజేపీలు 101 నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఇక ఆర్‌జేడీ, కాంగ్రెస్, సీపీఐ(ఎమ్ఎల్) లిబరేషన్, ఇతర లెఫ్ట్ పార్టీలు, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీలు మహాగఠ్‌బంధన్‌గా (మహాకూటమి) ఏర్పడి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి.

# కొండా సురేఖ వివాదంపై నాగార్జున కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

గతేడాది ఓ మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ అక్కినేని నాగార్జున కుటుంబ సభ్యుల్ని ప్రస్తావిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి. దీంతో నాగార్జున.. కొండా సురేఖపై పరువు నష్టం దావా వేశారు. 'కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు మా కుటుంబ పరువుకు నష్టం కలిగించేలా ఉన్నాయి. అందుకే భారత శిక్షా స్మృతి సెక్షన్ 356 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలి' అని నాగార్జున తన పిటిషన్‌లో పేర్కొన్నారు.
కోర్టులో విచారణ కొనసాగుతుండగా.. కొండా సురేఖ సోషల్ మీడియా వేదికగా అక్కినేని కుటుంబానికి క్షమాపణలు తెలిపారు. ఆమె వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకంగా కాకపోయినప్పటికీ, అవి బాధ కలిగించాయని అంగీకరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో నాంపల్లి ప్రత్యేక కోర్టులో పరువు నష్టం కేసుపై విచారణ జరిగింది. విచారణ సమయంలో నాగార్జున తన దావాను స్వచ్ఛందంగా వెనక్కి తీసుకున్నారు. కొండా సురేఖ, నాగార్జున మధ్య నెలకొన్న వివాదం ముగిసినట్లైంది.
పరువు నష్టం దావా కేసు విచారణ ముందు రోజు మంత్రి కొండా సురేఖ 'ఎక్స్' వేదికగా అక్కినేని కుటుంబ సభ్యులను ఉద్దేశిస్తూ గతంలో చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. 'నాగార్జున, ఆయన కుటుంబ సభ్యుల్ని బాధ పెట్టాలని నేను మాట్లాడలేదు. వారి పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించాలన్నది నా ఉద్దేశమే కాదు. ఆయన కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో పొరపాటు ఉంటే చింతిస్తున్నా. గతంలో నేను చేసిన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుంటున్నా'అని పేర్కొన్నారు.

# తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

మొదటి పేజీ తరువాయి

జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాగా.. 2025 ఏడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో విడుదల చేశారు. ఇప్పటికే పరీక్షలు పూర్తి చేయగా.. జులై 22న ఫలితాలు సైతం వెల్లడించారు. తాజాగా రెండో విడత టెట్ నోటిఫికేషన్ గురువారం విడుదల చేశారు. ఇక ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సైతం టెట్‌లో అర్హత సాధించాలంటూ ఇప్పటికే సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే.. టీచర్లంతా ఈ టెట్ పాస్ కావాల్సి ఉంది. ఈ పరీక్షకు శుక్రవారం ( నోటిఫికేషన్ విడుదల చేస్తారు. శనివారం నుంచి నవంబర్ 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాల్సి ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో తొలి విడత పరీక్షలు నిర్వహించి.. జులై 22న ఫలితాలు వెల్లడించిన విషయం తెలిసిందే. రెండో విడత టెట్‌కు శనివారం నుంచి దరఖాస్తుల పక్రియ మొదలుకానుంది.

# ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలి

మొదటి పేజీ తరువాయి

నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలు లాభాల్లోకి వచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆరంఘర్‌లో బస్సు టెర్మినల్ కోసం పోలీసు శాఖ భూములపై చర్చించాలన్నారు. హైదరాబాద్‌లో కొత్త డిపోలకు స్థల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బస్సు ప్రమాదాలను తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు చేస్తామని వివరించారు. త్వరలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

# సుప్రీం ఆదేశాలను పాటించని స్పీకర్

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో పార్టీ మారిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుతో పాటు అన్నింటిపై సోమవారం విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసు రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును, శాసనసభ పటిష్టతను ప్రభావితం చేయనుంది అనడంలో సందేహం లేదు. గతంలో ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావన కూడా ఉండడం, ఈ విచారణకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. సోమవారం విచారణకు రానున్న ఈ కేసులో.. ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు.. భవిష్యత్తులో రాజకీయ నాయకులు పార్టీలు మారే విధానాన్ని, ఫిరాయింపులకు పాల్పడే ధోరణిని పూర్తిగా మార్చేసే అవకాశం ఉంది. కేసు ప్రాధాన్యత నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇవ్వబోయే తుది తీర్పు.. ఫిరాయింపులను ప్రోత్సహించే పార్టీలకు, ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు ఒక కఠినమైన హెచ్చరికగా మారుతుందో లేదో వేచి చూడాలి.

# ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజులు కడతా

మొదటి పేజీ తరువాయి

ఈ మొత్తాన్ని ఎంపీగా తనకు వచ్చే వేతనం నుంచి భరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అందించిన అంత్యోదయ స్ఫూర్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ అంశంపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనకు రాసిన లేఖను ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. ఏ ఖాతాలో ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయాలనే విషయాన్ని తనకు తెలియజేయాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే, పాఠశాలల వారీగా పదో తరగతి విద్యార్థుల వివరాలు, ఎంత మొత్తాన్ని జమ చేయాలనే వివరాలను కూడా తెలియజేయాలన్నారు. ఇదిలావుంటే కరీంనగర్‌లో ఇంతకుముందే ఇదే విధానాన్ని మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు.

# ఏనుగుల సంచారంపై ముందస్తు హెచ్చరికలు

**అటవీ అధికారులకు డిప్యూటి సిఎం సూచన**

ఏనుగుల సంచారంపై ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాలలోకి ఏనుగులు ప్రవేశించే పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నప్పుడు ముందస్తు హెచ్చరికలు చేయాలన్నారు. ఈ పక్రియను మరింత పెంచాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. కుప్పం మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో కిట్టయ్య అనే వ్యక్తి ఏనుగు దాడిలో మరణించిన ఘటనపై పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై పీసీసీఎఫ్, సంబంధిత అధికారులతో గురువారం ఉదయం డిప్యూటీ సీఎం చర్చించారు. కిట్టయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని సత్వరమే అందించాలని ఆదేశాలు జారీ చేశారు. తమిళనాడు అటవీ ప్రాంతం వైపు నుంచి వచ్చిన ఏనుగు మూలంగా ఈ ఘటన చోటు చేసుకుందని, అక్కడ కూడా సదరు ఏనుగు మూలంగా మరణాలు సంభవించాయని పవన్‌కు అటవీ శాఖ అధికారులు వివరించారు.

# బాల్య వివాహాల రహిత జిల్లాగా నిలవాలి

- బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి
- బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి
- గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించాలి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**

బాల్య వివాహాల రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్ల నిలవాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన పేర్కొన్నారు. మిషన్ వాత్సల్యలో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ, అమలవుతున్న పథకాలు, బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ శాఖల అధికారులతో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మిషన్ వాత్సల్యలో భాగంగా బాల్య వివాహాలు, బాల కార్మికుల కేసులు, వారి హక్కుల పరిరక్షణ తీసుకుంటున్న చర్యలు, వివిధ అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఎం చందన మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిదేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. బాల కార్మికుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారిని సమీప విద్యాలయాల్లో చేర్పించాలని, అనాథ పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన వారి పిల్లలను రెసిడెన్షియల్ స్కూళ్లలో జాయిన్ చేయాలని సూచించారు.విద్యాలయాలు, హాస్టల్ లో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై, 1098 హెల్ప్ లైన్ పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులను విద్యా ద్వారా సామాజికంగా, ఆర్థికంగా రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం అందించాలని, సేవలపై విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని, చిల్డ్రన్ హోమ్ పనులు పూర్తి చేయిస్తామని, పిల్లల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ అంజయ్య, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, డీ వీహెచ్ఓ రవీందర్ రెడ్డి, డీఈఓ వినోద్ కుమార్, డీఎస్పీ చంద్ర శేఖర్ రెడ్డి, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, జీసీడీఓ పద్మజ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ న్యాయవాదికి మద్దతుగా

## -కోరుట్ల న్యాయవాదులు నిరసన



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**

నిర్మల్ కోర్టు ప్రాంగణంలో న్యాయవాది పుట్ట అనిల్ కుమార్ పై పోలీస్ దాడిని నిరసిస్తూ...

కోరుట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు.

న్యాయవ్యవస్థపై దాడులుగా భావిస్తున్నామని, న్యాయ పరిరక్షణ, న్యాయవాదుల భద్రతకై అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో దాడులు జరిగితే ఏకమై పోరాడతామని, అవసరమైతే ప్రభుత్వం మెడలు వంచైనా చట్టం అమలు కొరకు ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నామని సభ్యులు తెలిపారు.

# బూడిద దందా..

- కుందనపల్లిలో ఆవేదన జ్వాలలు..
- కాంట్రాక్టర్లకు లాభాలు, ప్రజలకు రోగాలు



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 13:**

రామగుండం పరిధిలోని కుందనపల్లి గ్రామం బూడిదతో ఊపిరాడక తడబడుతోంది. ఒక్కో ఇంట్లో వ్యాధులు, ఒక్కో మనసులో ఆవేదన, ఒక్కో ఊపిరిలో విషం కలిసిపోయింది. ఎన్టీపీసీ ఉత్పత్తి కేంద్రాల నుంచి వెలువడుతున్న బూడిద చెరువుల వల్ల తినే అన్నం, తాగే నీరు, పీల్చే గాలి అన్నీ కలుషితమై గ్రామ ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.

**కుందనపల్లి ప్రజల ప్రాణాల మీద వ్యాపారం..!**

"బూడిదతో కుందనపల్లి మాకు నరకం అయింది. మాకు లాభం ఏమీ లేదు, రోగాలే వచ్చాయి" అంటూ గ్రామ మహిళలు కేకలు వేస్తున్నారు. ప్రజల జీవనోపాధి కాపాడాల్సిన నాయకులు కొంతమంది కాంట్రాక్టర్ల చేతిలో కీలుబొమ్మలుగా మారారని వారు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ప్రజల హక్కుల కోసం ఎన్టీపీసీ కార్యాలయం ముందు ధర్నా చేయాల్సిన నాయకులు, బూడిద కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం సింగరేణి కార్యాలయం వద్ద నిరసనలు నిర్వహించడం గ్రామ ప్రజలలో ఆగ్రహం రేపింది. "ఎన్టీపీసీ బూడిదతో మేము చస్తున్నాం, సింగరేణి వద్ద మీరు పోరాటం ఎందుకు చేస్తున్నారు? ఊరి కోసం పోరాడుతున్నారా? లేక కాంట్రాక్టర్ల కోసం?" అని మహిళలు ప్రశ్నించారు. కూలీలకు కూలీ ఇచ్చి ప్రెస్మీట్లు నిర్వహిస్తూ రాజకీయ ఆధిపత్యం చూపించుకోవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. "ఆ నలుగురే ఊరంతా కాదు, మేము కూడా కుందనపల్లివాళ్లమే" అంటూ మహిళలు తీవ్రంగా మండిపడ్డారు.

**బూడిద సమస్యపై గళమెత్తిన మహిళలు..**

బూడిద సమస్యపై గళమెత్తిన మహిళలు ఇప్పుడు పోలీసుల వేధింపులకు గురవుతున్నారని మరికొందరు ఆరోపించారు. "మా అమ్మ ఊరి కోసం పోరాటం చేస్తుందని మా పిల్లలను పోలీస్ స్టేషన్కు పిలిచి బెదిరిస్తున్నారు" అని ఒక మహిళ కన్నీటి గాథ చెప్పింది. ఈ పరిస్థితుల్లో గ్రామ ప్రజలు "బూడిద చెరువును తరలించండి లేదా మా ఊరిని తరలించండి" అంటూ ఆఖరి హెచ్చరిక జారీ చేశారు. "మా ఊరి మహిళలకు బూడిదతోడే మిషన్లు ఇచ్చి శుభ్రపరిచే పనులు మాకు ఇవ్వండి. మేమే మా ఊరిని కాపాడుకుంటాం" అని వారు గట్టిగా డిమాండ్ చేశారు.

**"బూడిద మాకు ముప్పు, మీకు సంపాదన!"**

"బూడిద మాకు ముప్పు, మీకు సంపాదన!" ప్రజలు న్యాయం కోసం పోరాడుతుంటే, నాయకులు రాజకీయాధిపత్యం కోసం ఆడుతున్న ఈ ఆటను నిలువరించకపోతే, రాబోయే రోజుల్లో బూడిద కాదు, కోపమే కుందనపల్లిని కప్పేస్తుందని మహిళలు హెచ్చరించారు.

# సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూస్తా

## - కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**

జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ గురువారం ఇబ్రహింపట్నం మండల కేంద్రంలోని రైతువేదికలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం ఆర్ ఏఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 34 మంది కళ్యాణలక్ష్మి, షాదిముభారక్ లబ్ధిదారులకు రూ. 34,03,944/- చెక్కులను, 11 మంది సీఎం సహాయనిధి లబ్ధిదారులకు రూ. 2,78,000/- చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, సహకార సంఘం చైర్మన్, డిప్యూటీ తహశీల్దార్, పలువురు నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పిల్లలకు చదువుతో పాటు ఆటలు ఎంతో అవసరం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- శ్రీ చైతన్య స్కూల్లో స్పోర్ట్స్ మేట్ వేడుకలు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్





**కరపత్రం ప్రతినిధి వేములవాడ**

పిల్లలకు చదువుతో పాటు ఆటలు ఎంతో అవసరమని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో డాక్టర్ బి.ఎస్ రావు జ్ఞాపకార్థం పిల్లలకి స్పోర్ట్స్ మేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు శ్రీనివాస్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి స్పోర్ట్స్ మేట్ ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లల్లో మానసిక,శారీరక దృఢత్వం ఏర్పడుతుందని, పిల్లలు ఆహారం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకునే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కరీంనగర్ శ్రీ చైతన్య ఏజీఎం ముద్రకోల రాజు, అకాడమిక్ కోఆర్డినేటర్స్ ప్రవీణ్, మమతా రెడ్డి, మిర్యాల మమత, ప్రిన్సిపాల్ సుదేష్ కుమారి, లీలావతి, ఇన్చార్జులు అంజయ్య, అరుణ్, రజిత, ప్రవళిక, యశస్విని, హరీష, పిఈటిలు సుధాకర్, తిరుపతి, మారుతి, కవిత , అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రేతల అరెస్ట్



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**

జగిత్యాల జిల్లా, కోరుట్ల పట్టణ సమీపంలో గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 200 గ్రాముల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అందెశ్రీకి ఘనంగా నివాళులు అర్పించిన కళా సంఘాల సమాఖ్య

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 13:**



సహజ కవి, ప్రజావాగ్గేయ కళాకారులు, తెలంగాణ ఉద్యమ కళాకారులు, కవి, రచయిత, గాయకులు, డాక్టర్ అందెశ్రీ సంతాప సభను గురువారం గోదావరిఖని కళా సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం స్ఫూర్తి భవన్ లో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. కళా సంఘాల అధ్యక్షులు కనకం రమణయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి ఎంతో అద్భుతమైన గీతాలను రచించి ప్రజలలో చైతన్యాన్ని రగిలించిన ఉద్యమ కళాకారులు అందెశ్రీ.. ఇవే కాకుండ ఎన్నో సామాజిక చైతన్య గీతాలను, జానపద గీతాలను, కవిత రచనలను రచించారని, వారి మరణం కళారంగానికి తెలంగాణ కళాకారులకు తీరనిలోటని వారు విషాదన్ని వెలిబుచ్చారు. సంతాప సభలో ఆయన యొక్క గీతాలను ఆలపించి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోదావరి కళా సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి మాదరి వాసు, సలహాదారులు కాసి పాక రాజమౌళి, సీనియర్ కళాకారులు రేణిగుంట రాజమౌళి, లేల్లెల వెంకటేశ్వరరావు, అట్ల జగ్గయ్య, దుర్గం రాజేశ్వరరావు, నాగుల శ్రీనివాస్, నూకల మొండి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం నియోజకవర్గం అభివృద్ధి చేయడమే నాధ్యేయం

- జనగామ త్వరలో మూడు కోట్లతో పనులు
- ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్



ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రామగుండం నియోజకవర్గం అభివృద్ధి చేయడమే నాధ్యేయం అని ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ జనగామలో రూ.45 లక్షల వ్యయంతో బీటీ రోడ్ పనులను ప్రారంభించారు. అలాగే జనగామ ప్రాంత అభివృద్ధి దిశగా సుమారు రూ.3 కోట్లతో రోడ్ వెడల్పు పనులను కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు జనగామ శివ, జనగామ నారాయణ, నడిపెల్లి కృపాకర్ రావు, జువ్వాడి విజయ రావు, తూడి మంగ, కంది మురళి, ఆరేళ్ల వెంకట్, ముత్యాల రమేష్, బొడ్డు చంద్రయ్య, మల్లెపెల్లి రాజ్యం, ఆడబత్తుల మల్లేష్, బొడ్డు వెంకట, బద్రి, ప్రశాంత్, గుండెబోయిన నరసయ్య, గుండెబోయిన మల్లయ్య, నీలం రామన్న, నీలం సంజీవ్, అధికారులు, గ్రామస్తులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బిజెపి నాయకులు

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 13**

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ఈటల రాజేందర్ ముఖ్య అనుచరులు వీణవంక మాజీ సింగల్ విండో చైర్మన్ పెద్ది మల్లారెడ్డి కూతురు డా,,సుప్రియ - డా,,ఆదిత్య కిషోర్ వివాహం బుధవారం కరీంనగర్ లోని కొండ సత్యలక్ష్మి గార్డెన్ లో జరిగింది. జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు పెరవేన రమేష్ కుమారుడు అఖిల్ - దివ్య వివాహం జమ్మికుంట లోని యంపిఆర్ గార్డెన్ లో జరిగింది.ఈ నూతన వధూవరులను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు,హుజురాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్ రెడ్డి,జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్,ఇల్లందకుంట మండల మాజీ బీజేపీ అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, ఈటల రాజేందర్ పిఏ ఎదులాపురం నరేందర్,,బీజేపీ నాయకులు కొమ్ము అశోక్,బొంతల అమరేందర్ తదితరులు ఆశీర్వదించారు.

# విద్యార్థుల కళాశాల సమయంలో బస్స సౌకర్యంగా కల్పించాలి..

- ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ జిల్లా కార్యదర్శి ఈర్ల రాంచెందర్ డిమాండ్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 13:**

పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి వెన్నంపల్లి మీదుగా కాల్వ శ్రీరాంపూర్ మండలం వరకు విద్యార్థులకు కళాశాల సమయంలో బస్స సౌకర్యంగా కల్పించాలని ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ జిల్లా కార్యదర్శి ఈర్ల రాంచెందర్ గోదావరిఖని డిపో మేనేజర్ నీ వినతిపత్రం ద్వారా కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బస్సు సౌకర్యం కల్పించాలని, పనులకు వేళ్ళే వారు ఇదే సమయంలో ప్రయాణం చేయడం వల్ల బస్ ఓవర్ లోడ్ తో ప్రయాణం చేయడం జరుగుతుందని, .ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులు అని వారికి తెలిపారు. అదనంగా ఒక బస్సు ను కేటాయించి నడిపించాలని వారిని కోరారు. డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి సమస్యను త్వరలో పరిష్కారిస్తామని హామి ఇచ్చారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం నవంబర్ 14 2025

# విద్యుత్ ఉత్పత్తి, సామాజిక సేవ, ఉద్యోగుల సంక్షేమం

– 48వ వసంతంలోకి రామగుండం ఎన్టిపిసి

**కరపత్రం ప్రతినిధి జ్యోతినగర్(రామగుండం), నవంబర్ 13:**
భారతావనికి వెలుగులు పంచుతున్న రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాజెక్ట్ శుక్రవారంతో 48వ వసంతంలోకి అడుగిడుతోంది. రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్లో 2,600, తెలంగాణ స్టేజీ-1లో 1,600, ఫ్లోటింగ్ సోలార్ యూనిట్లో 100, గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్రాజెక్టులో 10.. ఇలా మొత్తంగా 4,310 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. ఐఎస్వో-14001 సర్టిఫికెట్ పొంది 'సూపర్ థర్మల్ పవర్ స్టేషన్'గా రూపాంతరం చెందింది. అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ 14 నవంబర్ 1978న రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టుకు పునాది రాయి వేశారు.





**పర్యావరణ పరిరక్షణకు..**
విద్యుత్ ఉత్పత్తితోపాటు పర్యావరణ పరిరక్షణ లోనూ ఎన్టీపీసీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. 2019-20లో జిల్లాలో 90,000కు పైగా మొక్కలు నాటించింది. 53 రకాల మొక్కలతో మియావాకి విధానం ద్వారా నాలుగు స్టేజీల్లో 30,262 మొక్కలు నాటించి జిల్లాకే ఆదర్శంగా నిలిచింది.

**బూడిద వినియోగంలోనూ..**
విద్యుత్ తయారీ సందర్భంగా విడుదలయ్యే వ్యర్థ బూడిదను ఎన్టీపీసీ సెనోస్పియర్ సేకరణ, విక్రయాలు చేయడం ప్రారంభించింది. ఇటీవల నిర్మిం చిన సిమెంట్ ఫ్రీ ఫ్లైయాష్ బేస్డ్ జియో పాలిమర్ రోడ్డును అతితక్కువ కర్బన ఉద్గారం, తక్కువ నీటి వినియోగంతో చేపట్టింది. ఈ ప్రాజెక్టు బూడిద వినియోగం వైపు కొత్త కోణాన్ని ఆవిష్కరించింది.

**నీటి సంరక్షణలోనూ అగ్రగామి..**
ప్రవహించే నీటిని రీసైకిల్ చేయడంతోపాటు యాష్ హ్యాండ్లింగ్ కోసం వినియోగించే నీటిని రీసైకిల్ చేస్తూ హార్టికల్చర్ ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నారు. ఇటీవల జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ప్రాజెక్టు ఏర్పాటు కాగా.. రిమోట్ ఉపయోగించి వైర్ లెస్ వాటర్ వినియోగ డేటా పర్యవేక్షిస్తూ విద్యుత్ వెలుగుల్లో రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాజెక్టు మొదటి ప్లాంట్ రికార్డు కెక్కింది. అంతేకాదు.. ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించింది. సామాజిక సేవా బాధ్యతగా సీఎస్సార్ ని ధులతో ఎన్టీపీసీ ప్రభావిత, సమీప ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పాటుపడుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుతోంది.

**సోలార్ పవర్ ఉత్పత్తిలోకి..**
రామగుండం ఎన్టీపీసీ 13 డిసెంబర్ 2013న గ్రౌండ్ మౌంటెడ్ పద్ధతిన పది మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ పీవీ ప్లాంట్ ప్రారంభించింది. మనదేశంలోనే 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ పీవీ ప్రాజెక్ట్ (మన దేశంలోనే అతి పెద్దది)ను తన రిజర్వాయర్లో ఏర్పాటు చేసి రికార్డుకెక్కింది.

**పర్యావరణ అనుమతి..**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణలో 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈమేరకు తొలుత స్టేజీ-1లో ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లు నిర్మించింది. ఇందులోంచి 85 శాతం విద్యుత్తును తెలంగాణకు అందిస్తోంది. స్టేజీ-2లో ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఇటీవల పర్యావరణ అనుమతులు లభించాయి. వీటికితోడు విద్యుత్ ఉత్పత్తిలో ఐదు ప్రతిష్టాత్మక టస్కర్ జాతీయ అవార్డులు అందుకుంది. హిందీ భాషను ప్రోత్సహించడంలో 2023-24(రాజ్ భాషా వర్గం) స్వర్ణ శక్తి అవార్డు లభించింది. సీఐఐ ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్లాంట్ అవార్డు -2025 అందుకుని ముందుకు సాగుతోంది.

## శాతవాహన యూనివర్సిటీ డిగ్రీ విద్యార్థుల మొదటి సెమిస్టర్ ఇంగ్లీష్ నోట్స్ ఆవిష్కరణ:

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 13**
జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ , పీజీ కళాశాలలో సీనియర్ ఆంగ్ల అధ్యాపకుడిగా , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిగా పనిచేస్తున్న ధనపురి సాగర్ తయారుచేసిన డిగ్రీ 1వ సెమిస్టర్ 2025- 2026 నోట్స్ ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. శ్రీనివాస్ ఆవిష్కరించినట్లు సాగర్ తెలిపారు.



ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలో 1వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు ఈ నోట్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని, సులభంగా అర్థం చేసుకొని పరీక్షలలో ఉత్తమ మార్కులు పొందుటకు దోహదం చేస్తుందని తెలిపారు. ఆంగ్ల అధ్యాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ తను తయారు చేసిన ఈ నోట్స్ సామాన్య విద్యార్థలకు సైతం అర్థమయ్యే విధంగా రూపొందించడం జరిగింది. అలాగే దూర ప్రాంత విద్యార్థులు ఈ నోట్స్ ను ఉచితంగా పొందాలంటే 8885549467 నెంబర్ కు వాట్సాప్ ద్వారా కోరితే వారికి పిడిఎఫ్ రూపం లో పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సాగర్ ను కళాశాల కరస్పాండెంట్ వి ఆగం రావు ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, ఏ సి ఓ బి సంపత్ కుమార్ ,ఏవో బి శ్రవణ్ కుమార్, కళాశాల వివిధ విభాగ అధిపతులు డాక్టర్ ఎండి సలీం , నాంపల్లి శ్రీనివాస్ , అధ్యాపకులు అభినందించారు.

## ఓసీపీ 3 సిహెచ్పిలో బొగ్గు క్వాలిటీ వారోత్సవాల నిర్వహణ

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 13:**



రామగుండం ఓసీపీ త్రీ సిహెచ్పిలో నాణ్యత వారోత్సవాల సందర్భంగా సిహెచ్పి ఎస్ఈ ఏవి శ్రీనివాస్. క్వాలిటీ మేనేజర్ సుభాష్ జెండా ఆవిష్కరణ చేసి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. నాణ్యమైన బొగ్గును వినియోదారులకు సరఫరా చేయాలని కింది స్థాయి ఉద్యోగి నుంచి పై స్థాయి వరకు ప్రతి ఒక్కరూ క్వాలిటీ బొగ్గుని వినియోగదారులకు సరఫరా చేయాలని కోరారు. బొగ్గులో షెల్ బండ ఐరన్ తదితర వస్తువులను తొలగించాలని కోల్ బెంచిలను శుభ్రం చేసే క్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎస్పి అధికారులు ప్రదీప్, చరణ్, ఫిట్ సెక్రటరీ సేగ్గం శంకర్, క్వాలిటీ కెమిస్ట్ లు రమణాచారి, వెంకటేశ్వర్లు, చెల్పూరి సతీష్, అల్లి రమేష్, ప్రణయ్, భాస్కర్, ఎస్.వెంకన్న, జై.శ్రీనివాస్, ఏ.కోటీశ్వరులు, ఎస్.రాజ్ కుమార్, ఆర్.తిరుపతి, జి.రాజశేఖర్ వెంకటస్వామి, రాజేశ్వరరావు, విజయ్, అధిక సంఖ్యలో సీఎస్పీ ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

## దస్తగిరి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 13:**
ఇటీవల మరణించిన గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఇంచార్జి దస్తగిరి కుటుంబ సభ్యులను వారి నివాసంలో రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పరామర్శించారు. దస్తగిరి మరణం పట్ల ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఆత్మీయంగా ఆదరిస్తూ ధైర్యం చెప్పారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రెస్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మేము గుళ్ళు గోపురాల వైభవాలకు వ్యతిరేకం కాము..

– అధికారి చేసిన తప్పిదానికి బాధ్యత వహించి పునర్నిర్మాణం చేస్తున్నాం
– సంబంధిత అధికారులను కూడా మందలించా
– ఖని పట్టణాన్ని ఆధ్యాత్మిక నగర్ గా తీర్చిదిద్దుతా..
– పట్టణాన్ని అద్భుతమైన నగరంగా టెంపుల్ టౌన్ గా ఆధ్యాత్మిక భక్తికి నిలియంగా తీర్చిదిద్దుతా
– విలేకరులతో రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్...

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని నవంబర్ 13:**




మేము గుళ్ళు గోపురాల వైభవాలకు వ్యతిరేకం కామని రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. గోదావరిఖనిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రామగుండం కార్పొరేషన్ గోదావరిఖని పట్టణాన్ని రాబోయే రోజుల్లో ఆధ్యాత్మిక భక్తి కేంద్ర నగరంగా టెంపుల్ టౌన్ గా అద్భుతమైన నగరంగా తీర్చి దిద్దుతానని ఎవరు ఎన్ని విమర్శలు చేసినా వెనుకాడే సమస్య లేదని స్పష్టం చేశారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలో 46 పోచమ్మ, మైసమ్మ, వేల్పులమ్మ గుళ్లను కూలగొట్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి భక్తి విశ్వాసాలను పూర్తిగా తుంగలో తొక్కి ఎమ్మెల్యే తన అనుచరులు ఈ పాపాలను చేశారని విమర్శిస్తున్న ప్రజలకు నేను ఒకటే చెబుతున్నా .... రోడ్డు వెడల్పు కార్యక్రమాల్లో డివైడర్ల దగ్గర ఉన్న చిన్న గుళ్లను మాత్రమే తొలగించి మళ్లీ నిర్మాణం చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ.. కొందరు అధికారులు మితిమీరిన స్వేచ్ఛతో ఈ పనులు చేయించారు.. ఇది అధికారుల తప్పినమే గాని శాసనసభ్యుడిగా నా తప్పు కాదని, నా పార్టీ తప్పు కాదని చెప్పారు. నేను గుడులు, గోపురాలకు వాటి నిర్మాణాలకు వ్యతిరేకిని అయితే... ఎందుకు రామగుండం నియోజకవర్గ పరిధిలో రెండు మండలాలలో కార్పొరేషన్ పరిధిలో కోట్ల రూపాయల వ్యయంతో గుళ్ళు గోపురాలను ఎందుకు నిర్మిస్తానని ఆయన ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. హిందూ ధర్మాన్ని అన్ని మతాల ధర్మాన్ని కాపాడుతూ ఆధ్యాత్మిక భావాలకు అనుగుణంగా అన్ని గ్రామాలలో పట్టణాలలో దేవాలయాలు నిర్మాణం చేయుటకు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించి నిర్మాణ పనులు చేపట్టామని ఇది ఒకసారి ప్రతిపక్షాలు తెలుసుకోవాలని సూచించారు. రామగుండం కార్పొరేషన్ చుట్టూ ఒకవైపు జనగామ ఒకవైపు సుందిళ్ల మరోవైపు రాముని గుండాలు, అలాగే 350 ఫీట్లతో భారీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన, అలాగే పాలకుర్తి అంతర్గా మండలాలలోని గ్రామాలలో వేమునూరు, గుడిపల్లి, పాలకుర్తి, పెద్దంపేట, ఎల్లంపల్లి, లాంటి అనేక గ్రామాల్లో హిందూ దేవాలయాలకు, క్రైస్తవ చర్చిలకు, ముస్లిం మసీదుల నిర్మాణాల కోసం కోట్ల రూపాయలు మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యేగా నాకే దక్కిందని అన్నారు. అలాగే కోదండ రామాలయంలో గోపురం నిర్మాణాని మసీద్ గోడ నిర్మాణాన్ని కోటి రూపాయలు, క్రిస్టియన్ చర్చిలకు స్థలాన్ని, అలాగే స్మశాన వాటిక పూర్తిస్థాయిలో తీర్చిదిద్దడానికి ప్రణాళికలు పంపామని, త్వరలో వాటి పనులు కూడా ప్రారంభమవుతాయని కూడా తెలిపారు. ప్రధానంగా జనవరి 2026న గోదావరి నది ఒడ్డున జరిగే మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాటుకు ఐదున్నర కోట్ల వ్యయంతో శాశ్వత ప్రాతిపదికన సమ్మక్క సారలక్క తల్లి, పైడిత రాజు, గోవిందరాజు గద్దెలను శాశ్వత ప్రాతిపదిక నిర్మాణం చేస్తున్నామని, మేడారంను తలపించే విధంగా ఇక్కడ ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే ఎంత ప్రళయం వచ్చినా.. ఎన్ని వరదలు వచ్చినా.. ఎంత బ్యాంకు వాటర్ నిండిన.. ఎలాంటి ఇబ్బందులు భక్తులకు కలగకుండా ఉండేందుకు పూర్తిస్థాయి బృహత్తర కార్యక్రమాలని చేపడుతున్నామని, ఇందుకు సింగరేణి సంస్థ మూడున్నర కోట్ల రూపాయలు ఇచ్చిందని, ఎన్టిపిసి యాజమాన్యం వారికి అప్పగించిన పనులు చేస్తున్నాయని, ఒక ఆర్ఎఫ్సిఎల్ మాత్రం ఎలాంటి స్పందన చూపడం లేదంటూ తెలిపారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు, చిన్న చిన్న గుళ్లను నిర్మాణం చేసుకోవడం కొరకు వచ్చిన వారికి పూర్తిగా ఆర్థిక సహాయం.. నా సహాయం అందిస్తూ ఉంటే రోడ్ల మీద ఉన్న గుడులను అన్నిటిని కూలగొట్టించి పట్టించుకోకుండా ఎలాంటి ప్రకటనలు చేయకుండా ప్రజలను అవమానపరుస్తున్నారని అనేటువంటి ప్రతిపక్షాలకు, వ్యతిరేకులకు ఇది సవాలుగా విసురుతున్నానని.. ఇది ఈ ప్రాంతాన్ని టెంపుల్ టౌన్ గా ఆధ్యాత్మిక భక్తి చూడగానే ప్రజల్లో వచ్చేలా నిర్మాణం చేసి చూపిస్తానని ఆయన ప్రతిపక్షాలకు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్న వారందరికీ సవాల్ విసిరారు. త్వరలో చేసి చూపిస్తా.. పట్టణాన్ని తీర్చిదిద్దుతా.. ప్రజలందరితో మన్ననలు పొందుతా.. ఇది ఎమ్మెల్యేగా నా బాధ్యత అంటూ.. దీనిపైన ఎవరు ఎలాంటి ఆపోహాలు పడవద్దని.. ఎవరు ఏం చెప్పినా వినవద్దని.. మీకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్రంలోనే నేను మొట్టమొదటి వ్యక్తిగా మీకు హామీ ఇస్తున్నానని ఎమ్మెల్యే ఈ ప్రాంత ప్రజలకు తెలిపారు.

## ఓయూ నుంచి డాక్టరేట్ పొందిన చుక్కలతను సన్మానించిన బిజెపి రాష్ట్ర నేతలు పుల్లెల పవన్, సొల్లు అజయ్ వర్మ.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 13**
కరీంనగర్ పట్టణం ఉస్మాన్ పుర కు చెందిన చుక్క నరసయ్య పోచమ్మ , దంపతుల కూతురు చుక్కలత ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పొందిన సందర్భంగా తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బిజెపి రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ ,డాక్టర్ పుల్లెల పవన్ లు గురువారం రోజున ఆమెను ఘనంగా సన్మానించారు. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం నుంచి ప్రొఫెసర్ సునంద పాండే పర్యవేక్షణలో రీసెర్చ్ స్కాలర్స్ ఆస్పిరేషన్స్, జాబ్ అపోర్చునిటీస్ అండ్ ఎడ్యుకేషనల్ వేస్టేజీ- ఏ కంపరేటివ్ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ యూనివర్సిటీస్ ఇన్ ఇండియా అనే అంశంపై



పరిశోధన పూర్తి చేసినందుకు గాను చుక్క లతకు ఓయూ పరీక్షల విభాగం డాక్టరేటును ప్రకటించింది. కరీంనగర్ ఉస్మాన్ పుర కు చెందిన చుక్క లత తండ్రి బాల్యంలోనే మృతి చెందారు. తల్లి పోచమ్మ స్వీపర్ గా పనిచేస్తూ లత ను పోషిస్తూ చదివించింది. తన తల్లి ఆశయం తో పాటు తన ఆకాంక్షల మేరకు చుక్క లత చిన్ననాటి నుంచి ఇష్టంతో కష్టపడి చదువుతూ నాలుగు పీజీ కోర్సులతోపాటు ఒక బిఈడి కోర్సును పూర్తి చేసి ఓయూ సోషియాలజీ విభాగం నుంచి పీహెచ్డీ కోర్సును కూడా పూర్తిచేసి డాక్టరేట్ ను సాధించింది. పీహెచ్డీ కోర్స్ చేస్తున్న క్రమంలోనే తన తల్లి క్యాన్సర్ బారిన పడి మరణించింది. అయినప్పటికీ అధైర్య పడకుండా మొక్కవోని దీక్షతో పరిశోధన పూర్తిచేసి చుక్క లత డాక్టరేట్ ను పొందింది. తన పరిశోధనకు సహకరించిన ఓయూ సోషియాలజీ విభాగం అధ్యాపకులు, ఇతర మిత్రులకు చుక్కలత కృతజ్ఞతలు తెలిపారు. తన డాక్టరేట్ ను తల్లిదండ్రులైన చుక్క నరసయ్య పోచమ్మలకు అంకితం ఇస్తున్నట్లు డాక్టర్ లత తెలిపారు.

## జూదంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి – నలుగురు అరెస్ట్

– జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట నవంబర్ 13**
జిల్లా ఎస్పీ డి.వి. నవంబర్ 13శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, గురువారం నాడు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ శ్రీ రాజశేఖర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం ఆధారంగా కుల్చారం మండలం యెనగండ్ల గ్రామ పరిధిలోని అమ్మోరు ఆలయం వెనుక జూదం ఆడుతున్న వ్యక్తులపై దాడినిర్వహించారు.ఈ దాడిలో నలుగురు వ్యక్తులను పట్టుకొని, వారివద్ద నుండి రూ.16,712/- నగదు, 4 మొబైల్ ఫోన్లు మరియు 52 ఆట ముక్కలు స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసిన వస్తువులు పట్టుబడిన



నలుగురు జూదగాళ్లను కుల్చారం పోలీస్ స్టేషన్కు అప్పగించి, తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ మాట్లాడుతూ - జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాల వలన ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని, ముఖ్యంగా యువత తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆలోచనలతో చెడు మార్గాలను ఎంచుకుంటున్నారని పేర్కొన్నారు. కష్టపడానీదే ఏదీ ఊరికే రాదని, ప్రజలు కూడా ఇలాంటి సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించి సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు